# ఆఖరిఛాన్స్

## భలివాడ కాంతారావు

మేంముగ్గురం. కారు వెనుక సీట్లో వున్నవాళ్లు నాకన్నా చాలా పెద్ద రేంకులో వున్న ఆఫీసర్లు. కుందన్‌లాల్ షేగల్ పులిలానే కనిపిస్తాడు. మెలివేసిన మీసాలు చూస్తేనే యితగాడు ఒకసారైనా పులితో పోట్లాడి వుంటాడని అనుకోకుండా వుండలేం. రెండో వ్యక్తి రాజారాం కేసరి. ఇతను సింహంలా కనిపించకపోయినా తెల్ల జుత్తు సింహంజూలులాయెగుర్తుతోంది. మీసాలు లేకపోయినా పెదాలే మీసాల్లా కనిపిస్తున్నాయ్. కారెక్కినదగ్గరనించీ యేదో నములుతూనే వున్నాడు. కేసరి నములుతూవుంటే షేగల్ షేర్‌లా అరుస్తూనే వున్నాడు.

ఎండాకాలం వచ్చేసింది. ఎంత వేగిరం బయలుదేరినా ఓ నూరు కిలో మీటర్లు ప్రయాణంతో యింజను వేడెక్కిపోయింది. ముందు సీట్లో ఏనంగా కూర్చున్న నాకు యింజను వేడితో కాస్త యిబ్బందిగా వుంది. రోడ్డు వార ఒక పెద్ద మర్రి చెట్టు నీడలో డ్రయివరు కారు ఆపాడు. రోడ్డు వారనే యెండిపోయిన పెద్ద చెరువు మధ్యలో కాస్త బురద నీరుంది. చెరువుకూ మర్రి చెట్టుకు మధ్య ముళ్ళతుప్పల మీద యెర్రటి పళ్ళతో పచ్చని తీవలున్నాయ్. నోరూరుతున్నా మనిషి తినలేని ఆ పళ్ళు ఆ వచ్చే గొర్రెల మంద తింటుందేమోనని యెదురు చూస్తున్నాను. ఆ మంద అలా యీపళ్ళు తినకుండా యీ తీగలు ముట్టకుండానే కదలిపోయింది. ఎంత అందంగా ఆకర్షణగా వున్నా యీ పళ్ళ అంతరంలో విషముంది కాబోలు గొర్రెలు కూడా ముట్టుకోలేదనుకున్నాను. ఆ గొర్రెల మందలో మిగతా వాటికన్నా యెత్తుగా మిగతావాటికి లేని కొమ్ములతో ఒక గొర్రె పోతు అరుస్తూ కదలిపోతోంది. గొర్రెల కాపరి కర్రతో అదిలిస్తున్నాడు. కాస్సేపయ్యాక యింకో చిన్న గొర్రె మంద వచ్చింది. ఇందులో ఒక పెద్ద మేకపోతు అరుస్తూ కదలుతోంది. నేను నమ్మలేక ఒకరిని కాదు యిద్దరు గొల్లవాళ్ళను అడిగాను. "గొర్రెల మందలో మేకపోతెందుకు పెంచారని." ఇద్దరూ అన్నారు అది గొర్రెపోతే అని. అదొక సంకర జాతి [illegible]నని అనుకున్నాను.

మళ్ళీ ప్రయాణం. మేం వెళ్ళవలసిన ప్రదేశం యింకా నూరు కిలోమీటర్ల పైనే వుంది. ఘాటు రోడ్డు మీద పోయి లోయలో వున్న గిరిజనుల ప్రాంతంలో ఒక కార్ఖానా కట్టడానికి తగ్గ స్థలాన్ని నిర్ణయించాలి. ఈ బోర్డుకు అధ్యక్షత వహించవలసిన పెద్ద ముందు రోజే వేరే కారులో వెళ్లిపోయాడు. నాకున్న అర్హతలతోపాటు ఆ ప్రాంతంతో పరిచయం కాస్త వుందనీ, వాళ్ళ భాష నాకు అర్థం అవుతుందనీ నన్ను యీ బోర్డులో యిరికించారు. మేం వెళ్ళేసరికి ఒంటి గంట అయింది. మా కోసం రాష్ట్ర ప్రభుత్వం వారు అన్ని యేర్పాట్లు చేసారు. జిల్లా గెస్టు హౌస్‌లో మా అందరి మకాం. అది బ్రిటిష్ వారి హయాంలో కట్టిన గెస్టు హౌస్ కావట్టే ప్రతి గదీ విశాలంగా యెత్తుగా గాలి, వెలుతురు అందులో వున్నవాళ్ళను వుత్తేజపరచేటట్టుగా వుంది. డైనింగు టేబులు కుర్చీల దగ్గర నుంచి గదిలోని బీరువాల్లో కార్పెంటర్ పొంక్క కళాకారుని హృదయం కనిపిస్తోంది. ఆ రోజు మధ్యాన్నమే ఆ పరిసరాల షేపుల ముందు మా తలలన్నీ వంగాయి. జాగాలు వెతికి యే జాగా అన్నివిధాల సరియైనదో చెప్పే బాధ్యత యీ బోర్డుది. ఈ బోర్డు చేసే సిఫార్సులను యథాతథంగా ఆమోదించటం సాధారణంగా జరుగుతుంది.

ముందుగా వచ్చిన బోర్డు అధ్యక్షుడు అప్పుడే ఆ చుట్టుపట్ల పరిసరాలను ఒకసారి జీపులోనూ కాలినడకలోనూ చుట్టిముట్టి వచ్చేసాడు. పల్చని పిల్లి గెడ్డంతో దళసరి కళ్ళద్దాలతో సన్నంగా పోక చెట్టులా వున్న అతగానితో మరునటి రోజు వుదయం యించుమించు పరుగెత్త వలసి వచ్చింది. రెండు కొండల మధ్య వున్న ప్రదేశం కార్ఖానాకీ, ఆ కార్ఖానాలో పని చేసే వుద్యోగులకు ఆ దగ్గరలో ఒక చోట - ఆఫీసర్ల కోలనీ-యింకో ప్రక్క - ఇదంతా యిదిగో యీ మేపులోని యీ ప్రదేశం అని అక్కడి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, యీ బోర్డు సభ్యులకు అధ్యక్షుడు చూపిస్తున్నాడు.

ఆఫీసర్ల కాలనీ వచ్చే ప్రదేశం ప్రక్కనే ఒక చిన్న గిరిజన గ్రామం వుంది. అక్కడ మేమంతా నిల్చుంటే ఆ గ్రామం నించి కొందరు వచ్చి యీమూక యిక్కడ కెందుకొచ్చిందా అని చూస్తున్నారు. పాకల ముందు ఆడవాళ్ళు, పిల్లలు ఆశ్చర్యంగా చూస్తూ నిల్చున్నారు. నేను మెల్లగా కదలి ఆ గిరిజనుల దగ్గరకు వెళ్ళి వాళ్ళ భాషలోనే అడిగాను.

"ఈ భూమి మీద మీరేం పండిస్తారు?"

"మా గ్రామంలో పండే భూమి యిదొక్కటే" అంటూ హద్దులు అలా చిన్నొనే చూపిస్తూ అన్నాడొకడు. ఇంకొకడు "చోళ్ళు పండిస్తాం. సామలు పండిస్తాం. మేం అంతా అదే తింటాం."

"అది సరిపోతుందా?"

"ఓ చాలు..." అన్నారంతా.

ఇది తినేనా యింత బలంగా వున్నారనుకున్నాను. మరి కాస్త ముందుకెళ్తే ఆడవారి రూపాలు స్పష్టంగా కనిపించాయి. వాళ్ళ అవయవాల్లో శక్తి శరీరంలోని అందాలు ఏందే ప్రదేశాల్లో అపురూప సంపదై కూర్చుంది. తిరిగి వచ్చేసరికి

"మేమంతా యిక్కడ నిర్ణయాలు తీసుకుంటుంటే మీరక్కడ వాళ్ళతో యేం మాట్లాడుతున్నా"రన్నాడు నాతో సూటిగా అధ్యక్షుడు.

"మనం అడగవలసిన వాళ్ళను అడక్కుండా నిర్ణయాలు తీసుకుంటున్నామేమోనని అనుమానం వచ్చి, అసలు పరిస్థితి తెలుసుకుందామని..."

"ఇదిగో రాష్ట్ర ప్రభుత్వం పెద్దలు మనం కోరినంత జాగా యివ్వడానికి ఒప్పుకున్నారు. ఊరకనే యివ్వడానికి ముందుకొస్తుంటే-ఎలాగిస్తారో మనకెందుకు? ఇంకెవరితో మాటాడే అవసరం మనకు లేదు."

"ఇక్కడ మీరు ఆఫీసర్లు వుండడానికి కావలసిన బంగళాలు, గెస్టు హౌసు వగైరాలు కట్టడానికి యెంచుకున్నారు కదా"

"అవును. పది డాము పూర్తవగానే ఆ ముందుకు ఒక సరోవరం వస్తోంది. ఆ లేక్‌కి ఆనుకుని కట్టే యీ కాలనీ అంత అందమైన కాలనీ యెక్కడా వుండదు. ఇందులో నివశించే అదృష్టం మీకు పట్టవచ్చు" అన్నాడు బోర్డు అధ్యక్షుడు. మిగతా యెవరూ మాటాడకపోవటంతో అతను తొలి ప్రశ్నతో నన్ను మందలించినట్లుగా నేనుభావించటంవలన—

"వాళ్ళకు పండే భూమి యిదేనట. ఈ పంట మీదే వూరంతా బ్రతుకుతున్నారట."

"ఆ గ్రామాన్ని మనం ముట్టుకోవటం లేదు. ఇక్కడ యీ కార్ఖానా, యీ కాలనీ వస్తే వాళ్ళ ఆర్థిక పరిస్థితి యెంత మెరుగు పడ్తుందో ఆలోచించారా? తిండికోసం దేవులాడే పరిస్థితి పోతుంది. వారి ఆడవాళ్ళు ఆఫీసర్ల యిళ్ళల్లో పనిచేసి గడించవచ్చు. మగాళ్ళు కార్ఖానాకి సంబంధించిన పనుల్లో వుంటారు. ఈ పాకలు కొన్నాళ్ళకు పోయి సిమ్మెంటుతో కట్టిన యిళ్ళయిపోతాయి - చూస్తూ వుండండి."

"దూరం నించి చూసినా పేడతో అలికి సున్నంతోవేసిన ముగ్గులతో వున్న వాళ్ళ పాకలు మన సిమ్మెంటు యిళ్ళకన్నా

కంటికి, మనసుకు యింపుగా వున్నాయండి'' అన్నాను వూరుకోలేక.

''మన కాలం వృథా చెయ్యవద్దు. రండి పోదాం'' అని అతను ముందుకు కదలంగానే వెనుక అందరూ అతని అడుగుల్లో అడుగులు వేసుకుంటూ కదలిపోయారు. నేను కాస్సేపు అలా నిల్చుండిపోయాను. ఇంకా మావేపు చూస్తున్న ఆ గిరిజనుల వేపు చేతితో రమ్మని సైగ చేసాను. ఒకడు పరుగెత్తుకొచ్చాడు. ''ఆముందు బాబుగారితో వెళ్ళి యెందుకొచ్చారని అడగరా'' - వాడి భాషలో చెప్పాను.

వాడు కొంత దూరం మాతోనడిచి చప్పున వాడి భాషలో ఒక్కసారి ''మహానుభావుల్లారా! ఇక్కడి కెందుకొచ్చారు?'' అని వాడి భాషలో అరవగానే, ఆ వూరి వాడొకడు తమ గుంపులో వున్నాడని మిగతా వారు అప్పటి వరకు తెలుసుకోలేదు. అందరూ ఆగిపోయారు. అధ్యక్షుడు నావేపు తీక్షణంగా చూసాడు. మా వెంటనే వున్న తహసిల్దారు వాడి భాషలో—

''ఇక్కడ పెద్ద కార్ఖానా వస్తుంది. మీకు వుద్యోగాలు దొరుకుతాయి.''

''ఎంత పైసా?'' అని అడిగాడు వాడు.

''చాలా డబ్బే. ఇప్పసారా మీరు తాగఖర్లేదు. విస్కీ - బ్రాందీ... మాంచి నిషా. బాగా దొరుకుతుంది. మీ పిల్లలకు చదువు... మీకు మంచి తిండీ - బట్టా. ఈ బాబు వేసిన లాంటి బట్టలు నివ్వు వేస్తావురా!'' అని తహసిల్దారు జోక్ విసిరాడు.వాడు చేతులు కట్టుకునే ''పెద్దబాబుల్లారా! కోపం తెచ్చుకోకండి, ఒక మాట చెప్పకుంటాను. ఈ జాగాలో మా తాత ముత్తాతలు పుట్టారు. మేం పుట్టాం. ఈ జాగా మీద పండిన పంట యిన్ని తరాల్లోనూ మాకు సరిపోయింది. ఇక్కడే పుట్టి యిక్కడే పెరిగి యిక్కడే బుగ్గయ్యే కులం మాది.ఈ భూమి పెట్టిన బిచ్చంతో మేం మాదీ అన్న యెన్నెన్నో ఆటలూ పాటలూ అల్లుకున్నాం. మీరెవరో వచ్చి దీన్ని కాల్చకండి బాబో.''

వాడు చెప్పినది తర్జుమా చెయ్యగా విన్న కేసరి, షెగల్ ఒకసారి అధ్యక్షునితోపాటు తలాడించే సారు కానీ మాటాడలేదు.

''ముందుకు మంచి రోజులున్నాయ్. వెళ్ళురా వెళ్ళు...'' తాశిల్దారు అనేసి ముందుకు కదులుతూ ''పదండి. మీరు కోరిన జాగా దొరికి తీరుతుంది'' అన్నాడు.

అంతా కదలిపోయారు. వాడలా నిల్చుండిపోయాడు. ఆ వేళ మధ్యాన్నం గెస్టుహౌసులో బోర్డు ప్రొసీడింగ్స్ అధ్యక్షుడు డిక్టేట్ చేసేసాడు. కావలసిన భూమి మేపులు, సర్వే నెంబర్లు ఒక ప్రక్క తయారైపోతున్నాయి. డ్రాఫ్టు వైపు కాగానే బోర్డు మెంబర్లంతా ఒకచోట చేరాం. ఆయన చదువుతుంటుంటే అంతా ప్రతి పేరా చివర 'యస్... యస్' అంటున్నారు. నేను మౌనంగా వుండటం చూసి అధ్యక్షుడు మీరేం వూరుకున్నారన్నాడు. చివర్లో చెప్తానన్నాను. అంతా అయ్యాక—

''మీ అభ్యంతరం ఏమైనా వుందా?'' అన్నాడు.

''ఆఫీసర్ల కాలనీ ఇంకో చోటికి మారిస్తే'' అన్నాను.


''ఈ కార్ఖానా బాగా నడవాలంటే ఆఫీసర్లు సుఖంగా వుండేటట్లు చూడాలి. అందమైన వాతావరణంలో హాయిగా జీవించే వాళ్ళు ఎంతైనా సృష్టించగలరు.''

''పని వాళ్ళకోసం కట్టే కాలనీలో జాగా వున్నట్లుంది'' అన్నాను.

''రెండు వర్గాలు ఒకచోట నివసించటం నాకిష్టం లేదు. సరే మిగతా మెంబర్లు ఏమంటారో చూద్దాం'' అని మిగతా వాళ్ళను అడిగాడు.

''మీతో ఏకీభవిస్తున్నాను సార్'' అని కేసరి అంటే—

''మీ సూచనతో మాలికి మారుపాళ్ళు సమ్మతిస్తు



న్నాను" అని షేగల్.

నావేపు అధ్యక్షులవారు చూసి, "మీరు జూనియర్ ఆఫీసరు. ఇంకా మెదడు పదునెక్క లేదు. మనిషి చేసే ప్రతి పనిలోనూ మంచి చెడులుంటాయ్. లాభనష్టాలుంటాయ్. ఇందులో వుండే లాభనష్టాలు బేరీజు వేసి లాభం హెచ్చు మందికుంటే. దాన్ని అమలు పర్చడానికి పరుగెత్తాలి. నాతో పనే అంత. ఐ మీన్ బిజినెస్."

ఒకవిధంగా నాపరిధి దాటి పోతున్నానని అతను గుర్తు చేసాడు. నాఒక్కని గోల మిగతా నలుగురి గొంతుకలుకలిసి అరచిన అరుపుల మధ్య వినపడలేదు. వచ్చిన పని సవ్యంగా పూర్తయినందుకు అధ్యక్షులవారు ఆ రాత్రి బోటిల్ విప్పుతానన్నారు. అప్పుడు నేను సవినయంగా—

"అయ్యా! నాగోల విన్నారు కాదు. పోనీలెండి కనీసం నాకో కోరిక వుంది. చిరకాలం నించి ఆ కోరిక తీర్చుకో లేక పోతున్నాను. మీరు యీ బోర్డు మెంబరయిన జిల్లా కలెక్టరు గారితో చెప్తే ఈ రాత్రికి మనం ఆఫీసరు కాలనీ కట్టామను కున్న వూరిలోనే వాళ్ల నృత్యం చూసే అదృష్టం కలుగు తుంది."

"ఇంత తక్కువ వ్యవధిలో వీలౌతుందా?" అన్నాడు అధ్యక్షుడు.

"కలెక్టరుగారు చెప్తే నేను యెరేంజి చేస్తానన్నాడు తహశీల్దారు.

అధ్యక్షులవారికీ చూడాలని మనసుపుట్టినట్టుంది. చీకటి పడ్డాక జీపులో అంతా ఆ గిరిజన గ్రామం చేరుకున్నాము. పెట్టబోయే ఆఫీసరు కాలనీ వేపు గ్రామ చివర్లో పెద్ద



మర్రిచెట్టు వుంది. ఆ మర్రి చెట్టు మొదట్లో రాళ్ళతో అమర్చిన పీఠం వుంది. దాని మీద పెద్దలందరూ కూర్చు న్నారు. ఎవడైతే యిదివరకు పెద్దబాబుల్లారా అని సంబోధించి విన్నవించుకున్నాడో వాడే అడవి పూలదండను అధ్యక్షుల వారి మెడలో వేసాడు. అప్పటికే సన్నాయి, డోలు మోగుతోంది. అంత దూరంలో యెండు గడ్డి వుంది. కొద్ది కొద్దిగా గడ్డి తీసి వెలిగిస్తున్నారు. ఆ వెలుగులో ఆడా మగా చేతులు కలుపుకుని నృత్యం చేస్తున్నారు. నాగస్వరం నాగుతోంది. పడగెత్తిన నల్ల నాగులా గుంపు నాట్యం చేస్తోంది. నారి నారి నడుమ మగరాయుడు. ఒకరి నడుము యింకొకరు పట్టుకుని గొలు

సులా నాగు ఆకారంతో కదలుతున్నారు. ఆగకుండా రెండు గంటలైనా అదే పనిగా అలసట లేకుండా నాట్యం చేస్తున్నారు. తన్మయులై అంతా చూస్తుంటే మెల్లగా వెనుకనించి వెళ్ళి అధ్యక్షులవారి వెనుక కూర్చున్నాను.

"బాగుందా సార్?" అన్నాను.

"వండ్రఫుల్" అన్నాడు.

"ఎప్పుడైనా యిలాంటి నృత్యం చూసారా?"

"నిజం చెప్పాలంటే చూడలేదు. థేంక్యూ ఫర్ యెరేంజింగ్ దిస్."

"చూసారా... ఆ జాకెట్లు లేని యవ్వనాన్ని..."

"రియల్ బ్యూటీ... వెరీ రేర్ బ్యూటీస్"

"ఇంత సేపు ఆడుతున్నా అలసట లేదు చూసారా?"

"గొప్ప స్టేమినా వుంది."

"ఆ గొంతుకలు - ముఖ్యంగా ఆ ఆడ గొంతులు..."

"ఇక్కడే యెందరో లతామంగేష్కర్లున్నారు"

"ఆ చీరలు చూడండి..."

"ఎక్కడ కొన్నారో?"

"అవి వాళ్ళ కదుర్లు తిప్పిన దారంతో నేసిన చీరలండి - ఇదంతా మీకు నచ్చినందుకు సంతోషం."

"ఇది చూడకపోతే ఐవుడ్ హేవ్ మిస్డ్ గ్రేట్ లాట్" అన్నాడు తృప్తిగా.

"ఇదే మనకు ఆఖరి ఛాన్సని మీకు విన్నవించుకున్నాను."

"ఎందుకు లాస్టు ఛాన్సు?"

"మీరు మళ్ళీసారి వచ్చేసరికి యిక్కడ మన ఆఫీసర్ల కాలనీ వుంటాది కదా! ఆఫీసర్ల అమ్మల్ని చూసి వీళ్ళ


దీపావళి శుభాకాంక్షలతో

ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ నాన్-గెజిటెడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్

హైదరాబాద్

పి.ఎ.రమణయ్య
ప్రెసిడెంట్

ఎస్.రామారావు
ట్రెజరర్

ఆర్.పురుషోత్తం
జనరల్ సెక్రటరి




జాకెట్లు వేసుకుంటారు. పౌడరు రాసుకుంటారు. నిత్యం కొట్లాటతో గుండె జబ్బు తెచ్చుకున్న ఆఫీసర్లని అనుసరించి ఈ మగాళ్ళూ గుండె జబ్బు తెచ్చుకుంటారు. ఎలక్ట్రిక్ దీపాల వెలుగువల్ల ముఖాలు కృత్రిమ ముఖాలైపోతాయి. ఈ అపురూపమైన లయవిన్యాసం అంతా మన ఆఫీసర్ల స్టీరియోల నించి వచ్చిన జాజ్, రంబో మ్యూజిక్‌లో కలిసిపోతుంది. ఈ చేనేత వస్త్రాల బదులు నైలాన్లు ధరించిన సుందరీ మణులను చూస్తారు. అప్పు అప్పుడు మన ఆడవాళ్ళలా ఈ ఆడవాళ్ళూ అందంగా కనిపిస్తారు.మన కల్తీ కృత్రిమ జీవితం యిక్కడా పాకుకుపోయి విజృంభించి ఈ అపురూపమైన జీవితాన్ని ఖాళీ చేస్తుంది."

"బస్ బస్" అన్నాడు అధ్యక్షుడు. ఇంకా నృత్యం ఆగలేదు. నృత్యం అయ్యాక వాళ్ళేం అడగలేదు. పుచ్చుకోలేదు. అందులో ఒకడు తేనెను మట్టి కుండతో తెచ్చాడు. మట్టి గిన్నెల్లో పెద్ద అందరికీ తేనె పోసి యిచ్చారు త్రాగటానికి. కల్తీ లేని తేనె. కల్తీ యెరగని మనుషులు...

తెల్లవారగానే బ్రేక్ ఫాస్టు చేసి బయలుదేరాం. మళ్ళీ ముగ్గురం. వెనుక షెగల్ వాగుతుంటే కేసరి కూడా వాగుతున్నాడు.

"బాస్ ముందుగా వచ్చి అంతా డిసైడ్ చెయ్యటంతో మనపని సులువైంది" అని కేసరి అంటే—

"ఆయనతో అంతే. ఆయన చెప్పినదానితో అనువని యేకీభవించవలసిందే..." అని షెగల్.

"అతను అలా సన్నంగా పెర్సనాలిటీ లేదని అనుకున్న వాళ్ళు అడ్డదిడ్డంగా యెదురు తిరిగితే యేంచేస్తాడో తెలుసా?"

"అది కేరియర్ కాల్చేస్తాడా?"

"ఈ రఘువీర్ చేతికి కబంధహస్తాలున్నాయి బాబో? — వాడు పట్టిన పట్టు వదలడు. అవతలవాని శవంపై నడిచైనా అనుకున్న పని చేసి తీరుతాడు. చాలా జాగ్రత్తగా వుండకపోతే కెరియర్ కాల్చేస్తాడు."

ఇలా వాళ్ళిన్నో ఆఫీసు విషయాలు కారు కదులుతుండగా మాట్లాడుకుంటుంటే మేం ఇదివరకు కారాపిన స్థలం కనిపించింది. ఆ గొర్రెపోతు, మేకపోతులా వున్న గొర్రె పోతూ కనిపిస్తుందేమోనని వంగి చూసాను. ఆ తుప్పల మీద తీవల్లో యెర్ర పళ్ళు కనిపించాయి. కళ్ళు మూసుకున్నాను. గొర్రె పోతులు రెండూ అరుస్తున్నట్లు చెవులు గింగురుమంటున్నాయి. వెనుతిరిగి చూస్తే వెనుకసీటులో వినోదాతో యెదిగిన పెద్దలు దగ్గరగా యింకా మాటాడుకుంటున్నారు.

దీపావళి శుభాకాంక్షలు

భారత్ బార్ & రెస్టారెంట్

6/27, 28 శంకరపురం

కడప